క్లుప్తంగా

పాలెం సీతారాములోరి సన్నిధిలో వన సమారాధన



వక్కపట్లవారిపాలెం(నాగాయలంక): మండలంలోని వక్కపట్లవారిపాలెం(పాలెం) రామాలయం సీతారాము లోరి సన్నిధిలో ఆదివారం గ్రామస్తుల ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా కార్తిక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. తొలుత హనుమత్ లక్ష్మణ సమేత శ్రీసీతారామచంద్రులకు ప్రమిదలతో దీపాలను వెలిగించి గ్రామ మహిళలు విశేష పూజ జరిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కార్తిక వన భోజనాల కార్యక్రమాన్ని సర్పంచి అంబటి శ్యామ్ ప్రసాద్ ప్రారంభించారు. వక్కపట్ల శ్రీహరి తదితరుల పర్యవేక్షణలో వెయ్యి మందికి సమారాధన జరిపారు.

గోకర్ణేశ్వరుడికి అన్నాభిషేకం



కోడూరు: దివిసీమలో ప్రసిద్ధి గాంచిన లింగారెడ్డి పాలెంలోని బాలా త్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వర స్వామివారికి ఆదివారం అన్నాభిషేకాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. కార్తికమాసాన్ని పురస్కరించుకుని ఉదయం లింగాకారుడికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలను కనులపండువగా జరిపారు. వేదపండితులు మంత్రోచ్ఛరణల నడుమ లక్ష బిల్వార్చన జరిపారు. అన్నం రాశిని స్వామివారికి సమర్పించి భక్తిభావం చాటారు. ఆలయంలో మహిళలు కార్తిక దీపాలు వెలిగించి భక్తిభావం చాటారు. ఆలయ ఈఓ సుధాకర్, జేఏ శివప్రసాద్ పర్యవేక్షించారు.

9వ రోజుకు చేరిన రైతుల రిలే దీక్షలు

బంటుమిల్లి: స్థానిక లక్ష్మీపురం సెంటరులో దాళ్వా నీటి కోసం రైతులు చేపట్టిన రిలే దీక్షలు ఆదివారంతో 9వ రోజుకు చేరాయి. తీర ప్రాంతంలో రెండో పంట వరి తప్ప ప్రత్యామ్నాయ పంటలకు అవకాశం లేదని, చౌడుగా మారుతున్న భూముల కారణంగా దిగుబడులు లేక రైతులు నష్టపోతున్నారని రైతు సంఘ నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి బంటుమిల్లి కాలువ పరిధిలో రెండో పంట దాళ్వాకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలలో సీపీఎం, రైతు సంఘం నాయకులు గొరిశెట్టి నాగేశ్వరరావు, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు ఎస్.జనార్దనరావు, అజయ్‌ఘోష్, బుజ్జి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

కృత్తివెన్ను: మండలంలోని సంగమూడి సమీపంలో 216వ నంబరు జాతీయరహదారిపై ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు రెండు మోటారు సైకిళ్లు ఎదురెదురుగా వచ్చి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. రెండు వాహనాలపై ఉన్న వారికి స్వల్పగాయాలు కాగా, వారిలో ఒకరికి తల, చేతులు, కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని వైద్యసహాయం కోసం మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై తమకు ఎటువంటి సమాచారం లేదని పోలీసులు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో లక్ష బిల్వార్చన



మచిలీపట్నంటౌన్: కార్తిక మాసం సందర్భంగా నగరంలోని రాజుపేటలో ఉన్న ముచ్చం గుడిలో శివునికి లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని ఆదివారం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ పూజారులు, భక్తులు స్వామి వారికి లక్ష బిల్వాలతో(మారేడు ఆకులు) అర్చన చేశారు. ఉదయం స్వామి వారికి అన్నాభిషేకం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ భక్త కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.

ప్రధాన రహదారిపై పశువుల హల్‌చల్

- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- పోట్లాడుకుంటూ వాహనాలకు అడ్డం
- పంట పొలాలు నాశనం చేస్తున్నాయని రైతుల ఆవేదన
- పురపాలకుల చర్యలు మూన్నాళ్ల ముచ్చటే



ప్రధాన రహదారికి అడ్డంగా పడుకున్న పశువులు

పెడన: పెడన పట్టణంలోని ప్రధాన రహదారి పశువులకు అడ్డాగా మారింది. రాత్రి, పగలు అని తేడా లేకుండా వాహనాలకు అడ్డం పడుతున్నాయి. పశువులు ఒకదానికొకటి పోట్లాడుకుంటూ వాహనాలపైకి దూసుకొస్తున్నాయి. ఎక్కడ వాటిని ఢీకొట్టి పడిపోతామేమో అనే భయం వాహనదారులను వెంటాడుతోంది. ఈనెల 9వ తేదీ శనివారం రాత్రి ఏడు గంటల సమయంలో ఒక కుటుంబం కారులో ప్రయాణం చేస్తూ పశువులు అడ్డంగా ఉన్నాయని తప్పించి వెళ్తుంటే షడన్‌గా కారు డ్రైవర్ పక్క డోర్‌ను బలంగా ఢీ కొట్టాయి. దీంతో డోరు అద్దాలు పగిలిపోయాయి. కారులోని కుటుంబసభ్యులు ఒక్కసారిగా కంగారు పడ్డారు. రోడ్డుపై జనం ఏ జరిగిందో అర్థం కాక గుమిగూడారు. డ్రయివర్ చెప్పేవరకు కూడా ఏం జరిగిందనే విషయం ఎవరికీ అర్థం కాలేదు. ఆవు ఒక్కసారిగా డోర్‌ను ఢీ కొట్టిందని చెప్పడంతో హడావుడిగా వాటి యజమానులు పక్కకు తోలారు.

జరిమానాలు వేసినా స్పందన లేదు

మున్సిపల్ అధికారులు గతంలో ఒకసారి స్పందించి రోడ్లపై తిరుగుతున్న పశువులను బంధించి బందులదొడ్డిలో ఉంచినా పశువుల యజమానుల్లో ఎటువంటి స్పందన రాలేదు. ఇటీవల పట్టణ శివారులోని రైతులు సైతం పశువులు తమ పొలాల్లోకి వచ్చి పంట పొలాలు నాశనం చేస్తున్నాయని, వాటిని అరికట్టాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అయినా మున్సిపల్ అధికారుల్లో స్పందన శూన్యం.

చిరు వ్యాపారులపై మాత్రం పెత్తనం...

రోడ్డు మార్జిన్ల వెంబడి వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులను ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారంటూ నిత్యం ఇటు పోలీస్ అధికారులు అటు మున్సిపల్ అధికారులు వేధిస్తారు తప్ప రోజూ ట్రాఫిక్‌లో వాహనాలకు అడ్డం పడుతున్న పశువులను పట్టించుకోవడం లేదని, ఏదేని ప్రమాదం జరిగితే తప్ప అప్పటివరకు ఎవరూ స్పందించరని ప్రజలు విమర్శిస్తున్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నాయి



ప్రధాన రహదారిపై వాహనాలకు అడ్డంగా పడుకుని ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. హారన్ కొట్టినా కదలడం లేదు. కండక్టర్ లేదా ప్రయాణికుడు దిగి వచ్చి వాటిని పక్కకు తోలి వాహనాలను పోనిస్తున్నారు. ఒక్కోసారి బెదిరి పక్క వాహనాల పైకి వస్తాయనే భయం కూడా ఉంటోంది.

–వీరంకి రాజేష్, 16వ వార్డు, పెడన

చర్యలు తీసుకుంటాం



ఇటీవల పశువులు రోడ్డుకు అడ్డంగా ఉంటున్నాయని, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందనే విషయం నా దృష్టికి కూడా వచ్చింది. త్వరలో పశువుల యజమానులతో సమావేశమై తగు చర్యలు తీసుకుంటాం. మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరించేలా చూస్తాం.

–జి.సత్యనారాయణ, ఎస్‌ఐ, పెడన

వాతావరణం మార్పుతో ఆందోళనలో రైతులు

- నేటికీ ప్రారంభం కాని ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- దళారుల చేతిలో మోసపోతున్న రైతులు



ఘంటసాలలో ధాన్యం ఆరబెడుతున్న రైతులు, కూలీలు

ఘంటసాల: ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికొచ్చే సమయానికి వాతావరణం మార్పులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఓ వైపు చేతికొచ్చిన పంట, మరోవైపు తెరవని ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఈ పరిస్థితుల్లో రైతుల కష్టాన్ని ఆసరాగా చేసుకుని దళారులు తక్కువ ధరకే ధాన్యం కొనుగోలు చేస్తుండడంతో రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. ప్రస్తుతం ఘంటసాల, కొడాలి, యండకుదురు, మల్లాయి చిట్టూరు తదితర గ్రామాల్లో బీపీటీ ధాన్యం కోత కోసేందుకు సిద్ధంగా ఉంది. అయితే వాతావరణంలో మార్పులు రావడంతో కోత కోసేందుకు రైతులు ఆలోచన చేస్తున్నా, అకాల వర్షాలు పడితే చేతికొచ్చిన పంట నేలపాలవడమే కాక కంకులు మొలకెత్తుతాయనే భయంతో తప్పని పరిస్థితుల్లో వరి యంత్రాలతో గంటకు సుమారు రూ.3,500 చెల్లించి పంటను కోయిస్తున్నారు. ధాన్యం నిల్వ చేసుకోవడానికి అవకాశం లేక ఘంటసాలలో బుద్ధ ప్రాజెక్టు ప్రాంగణంలో, యండకుదురులో ప్రధాన రహదారుల వెంబడి పరదాలపై ఆరబెట్టుకుంటున్నారు. అయితే వడ్లు ఆరబెట్టేందుకు, వడ్లు రాసిగా పోసేందుకు కూలీలను పెట్టుకుంటే ఒక్కొక్కరికి రూ.600 వరకు చెల్లించాల్సివస్తోంది. ఇలా ఒక్కో రైతు, కౌలు రైతులు సుమారు ఐదు రోజుల నుంచి ధాన్యం ఆరబెట్టడం, రాశిగా చేసేందుకు సుమారు ఐదుగురు నుంచి పది మంది కూలీలు అవసరం అవుతున్నారు. ఒక్కో ప్రాంతంలో ట్రాక్టర్ల సాయంతో పోగు చేస్తున్నారు. ప్రభుత్వం త్వరగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరిస్తే అక్కడన్నా అమ్ముకుందామంటే ఇంకా తెరవకపోవడంతో దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది వరి యంత్రాలతో పంట కోసిన వెంటనే రూ.1700 నుంచి రూ.1900కు కొనుగోలు చేయగా నేడు రూ.1400 నుంచి 1500 లోపే దళారులు ధాన్యం కొనుగోలు చేయడంతో రైతులు సుమారు రూ.300 నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం త్వరగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

రేపటినుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నాం



మండలంలో మంగళవారం నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణకు మండల, గ్రామ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశామని చెప్పారు. బీపీటీ క్వింటా రూ.2,320, సాధారణ రకం క్వింటా రూ.2,300 ప్రభుత్వ రేటు నిర్ణయించినట్లు తెలిపారు. వరి కోతలు, యంత్రాల ద్వారా కోసిన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు.

–తహసీల్దార్ బి.విజయ ప్రసాద్

ఉన్నతమైన లక్ష్యాలతోనే విద్యార్థులకు గుర్తింపు



పెడనలో చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఘంటసాల: ఉన్నతమైన లక్ష్యాలతోనే విద్యార్థులకు గుర్తింపు వస్తుందని ఘంటసాల ఎస్‌ఐ కె.ప్రతాప్ రెడ్డి అన్నారు. ఘంటసాల, కొడాలి, శ్రీకాకుళం గ్రంథాలయాల్లో గ్రంథాలయ వారోత్సవాలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాల్లో ఉండే పుస్తకాల ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డిని ఘంటసాల గ్రంథాలయాధికారి ఎం.శరత్ కుమార్ దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కొడాలి గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించగా, శ్రీకాకుళం గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో గోగినేనిపాలెం హెచ్‌ఎం తమ్మన వేణుగోపాలరావు విద్యార్థులకు విద్యాపరమైన అంశాలపై అవగాహన కల్పించారు.

చింతగుంటపాలెం గ్రంథాలయంలో ముగ్గుల పోటీలు

మచిలీపట్నంటౌన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నగరంలో చింతగుంటపాలెం శాఖా గ్రంథాలయంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. వి.జాహ్నవి, సయ్యద్ సహీనా ప్రథమ, ద్వితీయ స్థానాలను కై వశం చేసుకున్నారు. విజేతలకు ఈ నెల 20వ తేదీన జరిగే ముగింపు కార్యక్రమంలో బహుమతులను ప్రదానం చేస్తామని గ్రంథాలయాధికారి డీవీ నాగరవి తెలిపారు. పోటీల న్యాయ నిర్ణేతలుగా ఉపాధ్యాయులు బి.సురేష్‌కుమార్, కె.కృష్ణవేణి వ్యవహరించారు.

విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు

బంటుమిల్లి: మండల పరిధిలో ఆర్తమూరు శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ నిర్వహణాధికారి దుర్గ పర్యవేక్షణలో విద్యార్థులకు కుర్చీలాట, లెమన్ అండ్ స్పూన్ రన్నింగ్ తదితర ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో స్థానిక ఎంపీయూపీ స్కూలు, హైస్కూలు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

కోడూరు: గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి పుష్పలత పర్యవేక్షణలో కోడూరు జెడ్పీ పాఠశాల విద్యార్థులకు మ్యూజికల్ చైర్, లెమన్ అండ్ స్పూన్, ఇండోర్ గేమ్స్ నిర్వహించారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

మచిలీపట్నంటౌన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. జూనియర్స్‌కు డిజిటల్ విద్యా విధానం, సీనియర్స్‌కు మాదక ద్రవ్యాలు– యువత అనే అంశాలపై పోటీలు నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉప గ్రంథాలయ అధికారి ఎంవీడీటీ నగేష్ పర్యవేక్షించారు.

పుస్తక పఠనాన్ని అలవరుచుకోవాలి

గూడూరు: ప్రతి ఒక్కరు పుస్తక పఠనాన్ని అలవరుచుకోవాలని గూడూరు ఏఎస్‌ఐ ఆర్వీ స్వామి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గూడూరు శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహుడు ఎస్‌ఆర్ రంగనాథన్ చిత్రపటానికి ఏఎస్‌ఐ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వై.శ్రీనివాసరావు, బీడీఎస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో సత్ఫలితాలు

పెడన: విద్యార్థులు గ్రంథాలయాలకు వచ్చి పుస్తక పఠనం అలవాటు చేసుకుంటే మంచి ఫలితాలుంటాయని, వారి ప్రతిభ మెరుగుపడుతుందని పెడన శాఖ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ భళ్ల మల్లికార్జున ప్రసాద్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలలో నాలుగో రోజు ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కమిటీ సభ్యులు వేముల సురేష్, గ్రంథాలయాధికారి బసవేశ్వరరావు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోటెత్తిన భక్త జన సందోహం



మోపిదేవి ఆలయంలో క్యూలైన్లో వేచి ఉన్న భక్తులు :



దీపారాధన చేస్తున్న భక్తులు

మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానం భక్తజనంతో పోటెత్తింది. ఆదివారం ఉదయం తెలుగు ఉభయ రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. తెల్లవారుజాము నుంచే క్యూలైన్లన్నీ భక్తజనంతో చాంతాడులా ఆలయ వెలుపల వరకు బారులు తీరాయి. నాగపుట్ట, నాగమల్లివృక్షం, పొంగళ్లశాల వద్ద క్యూలైన్లలో గంటల కొద్దీ నిలిచారు. ఆలయ డీసీ దాసరి శ్రీరామ వర ప్రసాదరావు ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ పర్యవేక్షించారు. స్థానిక ఎస్‌ఐ సత్యనారాయణ పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఆలయం వెలుపల ప్రధాన రహదారికి ఇరువైపులా గంటల కొద్దీ భక్తుల వాహనాలు నిలిచిపోయాయి.

నగరేశ్వరునికి ఏకాదశ రుద్రాభిషేక పూజలు


మారేడు దళాలతో విశేష అలంకరణ



అభిషేకాల తదుపరి బిల్వ పత్రాలతో అలంకృతుడైన నగరేశ్వరస్వామి

నాగాయలంక: స్థానిక శ్రీపార్వతీ సమేత కన్యకాపరమేశ్వరీ సమన్విత శ్రీనగరేశ్వరస్వామి ఆలయంలో 32వ వార్షిక కార్తిక మాసోత్సవాలలో భాగంగా ఆలయ చైర్మన్ చిట్టా సాంబశివరావు నేతృత్వంలో అర్చకుడు బ్రహ్మశ్రీ కొల్లిపర సుబ్బారావు నేతృత్వంలో ఆదివారం నగరేశ్వరునికి 11 రుద్రాలతో మహాన్యాస పూర్వక అభిషేకాలు జరిపారు. వేకువనే భక్తుల సమక్షంలో గంధం, పసుపు, కుంకుమ, విభూది, సుగంధ ద్రవ్యాలతో అభిషేక పూజలు నిర్వహించారు. విభూది అభిషేకం తదుపరి శివయ్యకు ప్రీతిపాత్రమైన మారేడు దళాలతో అలంకరణ జరిగింది. దేసు సత్యనారాయణ, తాడికొండ సత్యనారాయణ, ఆకుతోట సీతారామయ్య, చిట్టా శివనాగేశ్వరరావు, వంకాయల ఆదిరాజేష్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని భావదేవరపల్లి శ్రీకాశీవిశ్వేశ్వర స్వామికి ధర్మకర్త పూషడపు నిరంజనరావు ఆధ్వర్యంలో అర్చకుడు సుబ్బారావు అభిషేకాలు జరిపారు.

శోభాయమానంగా శ్రీరామపాదక్షేత్రం





నాగాయలంక కృష్ణానది మధ్యలో దివ్య కాంతులతో మురిపిస్తున్న శ్రీరామపాదక్షేత్రం ధగధగలు ; కోటివత్తులకు జ్యోతి ప్రజ్వలన చేసిన మురళీకృష్ణ కవిత దంపతులు

- కృష్ణానదిలో దివ్య కాంతులీనుతున్న వైనం
- నిత్య నవనీరాజనాలతో రామలింగేశ్వరుడి వైభవం



రామలింగేశ్వరుని మండపంలో నవ నీరాజనాలు ప్రదర్శిస్తున్న వేద పండితులు

నాగాయలంక: కృష్ణానది తీరంలో నెల రోజుల కార్తిక మాసోత్సవాలలో పలు ఆధ్యాత్మిక సేవలకు వేదికగా మారిన శ్రీరామపాదక్షేత్రం నిత్యం భక్తుల శివ నామస్మరణతో మార్మోగుతోంది. కృష్ణమ్మ నిండుకుండలా ప్రశాంత వదనంతో భక్తులకు సాంత్వన చేకూరుస్తోంది. ఆధ్యాత్మిక వేదిక విద్యుత్, కార్తిక దీపాలు తనలో ఇమడ్చుకుని క్షేత్రం ప్రతిబింబం కృష్ణానదిలో కాంతులు వెదజల్లడం సందర్శకులకు కనువిందు చేస్తోంది. కృష్ణానది మధ్యలో సుంచి క్షేత్రాన్ని తిలకించడం అందమైన అనుభూతి కలిగిస్తోందని పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఘాట్‌లో శ్రీరామలింగేశ్వరస్వామికి ఆదివారం రాత్రి భక్తిశ్రద్ధలతో నవ నీరాజనాలు పలికారు. తొలుత ఉభయదాతలుగా ఉప్పల నాగమల్లేశ్వరరావు–శ్రీలక్ష్మి ఉప్పల మురళీకృష్ణ–కవిత దంపతులు కోటి వత్తులకు జ్యోతి ప్రజ్వలన చేశారు. తదుపరి అంబా సాయి కిరణ్ శర్మ నేతృత్వంలో శాస్త్రోక్తంగా సంప్రదాయరీతిలో వేద పండితులు నవ హారతులను దేదీప్యమానంగా ఆవిష్కరించారు. మహిళలు వివిధ ఆకృతులలో రూపొందించిన స్టాండ్‌లకు నూనె ప్రమిదలతో దీపాలంకరణ చేశారు. నవ హారతుల అనంతరం శివయ్యకు మంత్ర పుష్ప నీరాజనం జరిపి తీర్థప్రసాద వితరణ చేశారు. క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, ఉప్పల లీలాకృష్ణప్రసాద్, తలశిల రఘుశేఖర్ పర్యవేక్షించారు.

ఘనంగా కార్తిక వన సమారాధనలు



పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఉసిరి చెట్టు కింద దామోదర వ్రతంలో పాల్గొన్న మహిళలు

పెడన: కార్తికమాసం సందర్భంగా ఆదివారం వనసమారాధనలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీగంగాపార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి దేవస్థానంలో కార్తిక వన సమారాధన నిర్వహించడంతో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ భళ్ల ప్రసాద్‌తో పాటు అన్నసమారాధన కమిటీ నాయకులు పాల్గొని పర్యవేక్షించారు. పెడన పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బంటుమిల్లి రోడ్డులోని చిట్టూరి మాధవరావు తోటలో కార్తిక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. మహిళలు రాతి ఊసిరి చెట్టుకింద ప్రత్యేక పూజలు, దామోదర వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో చేశారు. అన్నసమారాధన కార్యక్రమాన్ని సంఘ నాయకులు నందం చిన బాబు, నందం నాని, చిలుకోటి గోవిందు, అనుముల పెద పూర్ణ, కేతన శ్రీను, సత్యనారాయణ తదితరులు పర్యవేక్షించారు. పెడన గృహ నిర్మాణ వర్తక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పెడన వ్యవసాయమార్కెట్ యార్డులో కార్తిక వన సమారాధన పురస్కరించుకుని సంఘ కార్యదర్శి వీణం శ్రీనివాస్ దంపతులు శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరించారు. అనంతరం సామూహిక సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. మున్సిపల్ సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు, వైఎస్సార్ సీపీ యువ నాయకుడు కటకం నాగకుమార్, గుడివాడ ఏరియా ఆసుపత్రి ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నడకుదురుకు పోటెత్తిన భక్తులు



నడకుదురులో పృథ్వీశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు

చల్లపల్లి(అవనిగడ్డ): కార్తిక మాసాన్ని పురస్కరించుకుని చారిత్రక ప్రసిద్ధి గాంచిన చల్లపల్లి మండల పరిధిలోని పృథ్వీశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఏలూరు, నూజివీడు, ద్వారకా తిరుమల, విజయవాడ, గుడివాడ, పామర్రు, మచిలీపట్నం నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి పృథ్వీశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని పాటలీవృక్షాన్ని, బాలా త్రిపుర సుందరీ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. పృథ్వీశ్వరస్వామి దర్శనానికి భక్తులు క్యూలైన్‌లో నిలబడి దర్శనం చేసుకున్నారు. నాగేంద్రస్వామి పుట్టలో పాలు పోసి మొక్కుకున్నారు. ఆలయ సమీపంలోని ఉసిరి వనంలోని ఉసిరి చెట్లకు పూజలు చేశారు. చల్లపల్లి పరిసర ప్రాంతాలకు చెందిన అయ్యప్ప మాలధారణ చేసిన స్వాములు ఆలయ ప్రాంగణంలో గురుస్వాములతో ఇరుముడులు వేయించుకుని శబరిమలకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆట పాటలతో పలువురు సందడి చేశారు. ఆలయ ఈవో యార్లగడ్డ వాసు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఆదిశైవ సంఘం జిల్లా సహాయ కార్యదర్శిగా కృష్ణకిషోర్

ఘంటసాల: విజయవాడ మాచవరంలోని ఆది శైవ సంఘం భవనంలో ఆదివారం జరిగిన ఆంధ్ర రాష్ట్ర ఆది శైవ సంఘం సమావేశంలో సంఘం అధ్యక్షుడు మురమళ్ల రాంబాబు ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా సంఘం అధ్యక్షునిగా మామిళ్లపల్లి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా కంఠమరాజు సాయి, సహాయ కార్యదర్శిగా ఘంటసాలకు చెందిన అర్చకుడు చావలి కృష్ణ కిషోర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకుని ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కార్తిక సమారాధన, వన భోజన కార్యక్రమాలు నిర్వహించారు.

అవనిగడ్డ రెడ్‌క్రాస్ చైర్మన్‌గా శేషబాబు

అవనిగడ్డ: అవనిగడ్డ రెడ్‌క్రాస్ సొసైటీ నూతన అధ్యక్షుడిగా గుడివాక శేషబాబును ఎన్నుకున్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో శేషబాబుతో పాటు వైస్ చైర్మన్‌గా గరికపాటి హరిప్రసాద్, సెక్రటరీగా అన్నపరెడ్డి వీరకుమారి, కోశాధికారిగా అల్లంశెట్టి వెంకటేశ్వరరావుతో పాటు పదిమందిని కార్యనిర్వాహక సభ్యులుగా ఎన్నుకున్నారు. డెప్యూటీ తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ వంగర శేషగిరిరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు కొండవీటి ఈశ్వరరావు, న్యాయవాది బీవీ శేషగిరిరావుతో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.